క్లుప్తంగా

9న జాబ్ మేళా

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్, వికాస సంయుక్తంగా ఈనెల 9న జాబ్ మేళా నిర్వహిస్తున్నాయని ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు తెలిపారు. ఐసీఐసీఐ బ్యాంక్, డెక్కన్ కెమికల్స్, సోలార్ ఫార్మా, ఇసుజీ మెటార్స్, డిక్సాన్ తదితర కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకూ చదివిన వారు అర్హులన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి రూ 13,400 నుంచి రూ 19,465 వరకు జీతం అందిస్తారన్నారు. ఆసక్తి కలవారు వారు అదనపు సమాచారం కోసం సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లేదా, 94940 89595, 94416 10055 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఇంటింటికీ అక్షతల పంపిణీ



జి.మామిడాడలో అక్షతలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

పెదపూడి: ఆయోధ్యలో రామమందిర నిర్మాణ పూజా అక్షతలు, రామమందిర చిత్రాలను ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, బీజేపీ నాయకులు ఇంటింటికీ పంపిణీ చేస్తున్నామని బీజేపీ నియోజకవర్గం కో కన్వీనర్ మురముళ్ల వెంకటరమణ తెలిపారు. జి.మామిడాడలో బుధవారం ఇంటింటికీ వెళ్లి అయోధ్య నుంచి తెచ్చిన అక్షతలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకులు మల్లిడి వెంకటకృష్ణారెడ్డి, కొవ్వూరి అప్పారెడ్డి, సుగుణ దంపతులు, కొవ్వూరి వీరాఘవరెడ్డి, కేతా రాము, చిర్ల చిరంజీవిరెడ్డి, సత్తి సూర్యనారాయణరెడ్డి, భజన సంఘం మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడాదుస్తుల పంపిణీ



క్రీడాకారులకు దుస్తులు అందజేస్తున్న లచ్చారెడ్డి ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు

అనపర్తి: స్థానిక శ్రీరామారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ కర్రి లక్ష్మీనారాయణరెడ్డి(లచ్చారెడ్డి) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన జ్ఞాపకార్థంగా లచ్చారెడ్డి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో వాలీబాల్ క్రీడాకారులకు 50 జతల దుస్తులు అందజేశారు. జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం పులగం వెంకటరెడ్డి అధ్యక్షతన పాఠశాల క్రీడామైదానంలో జరిగిన ఈ కార్యక్రమంలో టి.సూర్యారెడ్డి, సీహెచ్ వెంకటరెడ్డి, ఎం.రామారెడ్డి, కె.జగన్నాథరెడ్డి, సత్తి పోతారెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, ఎన్.గోవిందరెడ్డి, కె.సత్యనారాయణరెడ్డి, లచ్చారెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనలు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి ఆర్‌సీఎం చర్చిలో బుధవారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. రాజమహేంద్రవరం పారిస్ రెవరెండ్ ఫాదర్ మనోజ్ కుమార్ వాక్య సందేశం అందించారు. నిత్యం బైబిల్ పఠనం ద్వారా జ్ఞానాన్ని పొందగలమన్నారు.

సారా కేసులో వ్యక్తి అరెస్టు

రంగంపేట: సారా కేసులో వ్యక్తిని అరెస్టు చేసినట్టు సెబ్ సీఐ జి.వెంకటలక్ష్మి తెలిపారు. బుధవారం రాత్రి ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని ఈలకొలను గ్రామంలో తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా గ్రామానికి చెందిన కురుకూరి శ్రీనివాస్ 12 లీటర్ల సారా ఉండడంతో అతనిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు ఆమె తెలిపారు. నిందితుడిని పెద్దాపురం కోర్టులో హాజరుపరచగా రిమాండు విధించారన్నారు. ఈ దాడుల్లో సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల నిరసన

సీతానగరం: మండలంలోని మునికూడలి ర్యాంపు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణచౌదరి ఆరోపించారు. ఈ మేరకు బుధవారం మునికూడలి ఇసుక ర్యాంపును పరిశీలించారు. ఇసుక తవ్వకాలను అడ్డుకుని, రాజమహేంద్రవరం – సీతానగరం రోడ్డులో మునికూడలి వద్ద పార్టీ శ్రేణులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. విలేకరులతో మాట్లాడుతూ రైతుల పట్టా లంకభూములలో ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా దౌర్జన్యంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని ఆరోపించారు.

వైభవోపేతంగా లక్ష తులసి పూజ

ధవళేశ్వరం: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం లక్ష తులసి పూజ కార్యక్రమాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ కేంద్ర పాలక మండలి సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి స్వామిని దర్శించుకున్నారు. ముందుగా ఆమెకు ఘనస్వాగతం పలికారు.

నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు

- రూ.2300 కోట్లతో అభివృద్ధి పనులు
- అర్హులందరికీ ఇళ్ల పట్టాలు
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: రాజానగరం నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండలోని లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో రూ.2.300 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. 20,178 మంది పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేశామని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని మూడు మండలాల్లో సుమారు లక్ష గడపలు తిరిగి, గుర్తించిన సమస్యలను పరిష్కరించినట్టు తెలిపారు.

పలు సమస్యల పరిష్కారం

ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ కోరుకొండ, సీతానగరం మండలాల్లో లోతట్టు గ్రామాలకు శాపంగా మారిన ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చేపట్టామన్నారు. దానిలో భాగంగా రూ.91 కోట్లతో తొర్రిగెడ్డ కాలువపై రివర్స్ పంపింగ్ స్కీమ్ నిర్మాణానికి భారీ నీటిపారుదలశాఖ మంత్రి అంబటి రాంబాబుతో శంకుస్థాపన చేయించామన్నారు. రబీ పంటకు పుష్కలంగా నీరందించే చర్యల్లో భాగంగా మైనర్ ఇరిగేషన్ పనులకు ప్రభుత్వం రూ.38 కోట్లు కేటాయించిందన్నారు. ఈ కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభిస్తామన్నారు. రూ.215 కోట్లతో ఇంటింటికీ గోదావరి నీరందించే లక్ష్యంతో వాటర్ గ్రిడ్ పథకాన్ని ఈనెల 28వ తేదీన ప్రారంభించనున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకూ రూ. 140 కోట్లతో సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించామని, రూ. 13 కోట్లతో పుంతరోడ్లు అభివృద్ధి చేశామన్నారు. సీతానగరం మండలం ఇనుగంటివారిపేటలో ముస్లిముల కోసం రూ.70 లక్షలతో షాదీఖానా నిర్మిస్తున్నట్టు, సీతాగనరం, దివాన్ చెరువులో క్రీడా వికాస కేంద్రాలు నిర్మాణంలో ఉన్నట్టు తెలిపారు. వ్యవసాయ రంగం అభివృద్ధి రైతన్నల మేలులో భాగంగా విద్యుత్ సక్రమం సరఫరా కోసం 220/33 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో ఐదంతస్తుల రాజగోపురం, కొండ పైన ప్రాకార మండపం, మెట్లను రీమోడల్ చేసేందుకు కార్యాచరణ పూర్తయ్యిందన్నారు. రంగనాథస్వామి ఆలయ పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు. నియోజకవర్గంలోని 117 దేవాలయాలకు రూ.10 లక్షల చొప్పున నిధులు కేటాయించి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. జరిగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల నేపథ్యంలో ప్రజలు మళ్లీ జగనన్న ప్రభుత్వానికే పట్టం కట్టాలని, తద్వారా మరింత సంక్షేమాన్ని సాధిస్తారన్నారు. ముందుగా లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని తలనీలాలు సమర్పించారు. ఆయనతో పాటు పార్టీకి చెందిన 25 మంది తలనీలాలు సమర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, కో కన్వీనర్ గణేశుల పోసయ్య, రాజానగరం కన్వీనర్ దూలం పెద్ద, అన్నవరం దేవస్థానం సూపరింటెండెంట్ కిషోర్ బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు నాళం రోషయ్య, తాడి హరిశ్చంద్ర ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

7న బూరుగుపూడిలో సాధికార బస్సు యాత్ర

కోరుకొండ మండలం బూరుగుపూడిలో ఈనెల 7వ తేదీన జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సాధికారత కోసం తీసుకున్న చర్యలను, చేసిన మంచిని వివరించే ఉద్దేశంతో ఈ యాత్ర నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

సూర్యదేవుడిని దర్శించిన ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి



పండితుల నుంచి ఆశీర్వచనాలు తీసుకుంటున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్ రెడ్డి

పెదపూడి: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలని, అప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. జి మామిడాడ గ్రామంలో ప్రసిద్ధి చెందిన సూర్యనారాయణమూర్తి స్వామి వారిని ఆయన బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ మర్యాదలతో అర్చకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు స్వాగతం పలికారు. ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా సూర్యనారాయణమూర్తిస్వామి ప్రసిద్ధిగాంచారని చెప్పారు. ఎమ్మెల్యేను వైఎస్సార్ సీపీ నేత చింత దొరబాబు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి ఎంపీటీసీ సభ్యురాలు కర్రి వెంకట పద్మావతి, స్థానిక పార్టీ నాయకులు బుల్లి సూరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వాగతం

పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ లబ్ధిని రూ.3 వేలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెంచారు. ఈ కార్యక్రమాన్ని కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల క్రీడా మైదానంలో బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు ప్రముఖులు స్వాగతం పలికారు.

– రాజానగరం/ అనపర్తి





ముఖ్యమంత్రి జగన్‌కు స్వాగతం పలుకుతున్న అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న జగన్



కొంకుదురులో పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారయణరెడ్డి
- పెంచిన పింఛన్ల పంపిణీ

బిక్కవోలు: అవ్వ తాతాలకు సంవత్సరానికి 250 రూపాయాలు పెంచుతానని హామీ ఇచ్చి వారికి అందించే పింఛన్లు ఏటా పెంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని ఎమ్మెలే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండలంలోని కొంకుదురు, కొమరిపాలెం గ్రామంలోని ఫించన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం 1000 రూపాయాల మాత్రమే పింఛను ఇచ్చేదని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛను దశల వారీగా పెంచుకుంటూ ఈ రోజున రూ.3వేలు వరకు పింఛన్ పెంచిన ఘనత మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మనమందరం మళ్లీ జగన్ మోహన్‌రెడ్డికీ ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యత ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలోని జిల్లా మహిళ సంక్షేమ స్థాయి సంఘం చైర్మన్ రొంగల పద్మావతి, కొంకుదురు సర్పంచి సత్తి వీరమణి, సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి, ఎంపీటీసీ కొంకుదురు పి.వి.ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి, కొమరిపాలెం సర్పంచి వాసంశెట్టి రవికుమార్, ఉపసర్పంచి కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గం ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజి, వైఎస్సార్ సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ బోడ్డు ముత్యాలరావు, ఎంపీడీవో జె.ఎ.ఝాన్సీ, పంచాయతీ కార్యదర్శులు కర్రి సత్యనారయణరెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే గెలుపు మార్గాలు

- ప్రజలకు అవగాహన కల్పించాలి
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



కోరుకొండలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే వచ్చే ఎన్నికల్లో ఘన విజయానికి మార్గాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ హరేరామ సమాజ్ ప్రాంగణంలో బుధవారం పార్టీ నాయకులు, శ్రేణులతో సమావేశంలో నిర్వహించారు. తొలుత మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రీ బాయి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ తమ కుటుంబమంతా రాజకీయాల్లో నిలిచి, ప్రజల సేవే పరమావధిగా నడుస్తున్నట్టు తెలిపారు. ప్రజలు చాలా విజ్ఞానవంతులని మంచి చేసిన వారిని, సహకారాన్ని అందించిన వారిని విడువరన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించి, మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం

ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ ఎన్నికలకు సన్నద్ధం కార్యక్రమంలో భాగంగా నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. చేపట్టాల్సిన కార్యక్రమాలను తెలిపారు. ఆ ప్రకారం..

- ఈ నెల 8 నుంచి 13 వరకూ క్లీన్ రాజానగరం కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రధాన సెంటర్లు, ప్రాముఖ్యత గల ప్రాంతాలు, డంపింగ్ యార్డులను శుభ్రం చేస్తారు.
- ఈనెల 12, 13, 14 తేదీల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తారు. 16, 17, 18 తేదీల్లో పార్టీ నాయకులు, శ్రేణుల బంధువులు, మిత్రులతో అభ్యర్థన కార్యక్రమం ఉంటుంది.
- 19 వతేదీన విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆవిష్కరిస్తారు. దానిని పురస్కరించుకుని 19, 20 తేదీల్లో ఎస్సీ సామాజిక వాడల్లోని అంబేడ్కర్ విగ్రహాల వద్ద సమావేశాలు నిర్వహించి, ప్రభుత్వం నిర్వహించిన పనులను వివరిస్తారు.
- 22న సీతానగరం మండలం రఘుదేవపురంలో 30 పడకల హాస్పటల్ నిర్మాణానికి శంకుస్థాపన, సీతానగరంలో నిర్మించిన క్రీడావికాస కేంద్రం ప్రారంభోత్సవం జరుగుతుంది.
- 28న దివాన్ చెరువులో 25 వేల మంది మహిళలతో ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తారు. 215 కోట్లతో వాటర్ గ్రిడ్ పథకానికి శంకుస్థాపన, దివాన్ చెరువులో అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణ, మల్టీ స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన జరుగుతాయి.
- ఫిబ్రవరి 11న సీతానగరం మండలం బొబ్బిల్లంక నుంచి సీతానగరం వరకూ పాదయాత్ర, సీతానగరంలో బహిరంగ సభ నిర్వహిస్తారు.
- 15న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అభివృద్ధి పనులు, రంగనాథస్వామి ఆలయ పునర్నిర్మాణానికి చిన జీయర్ స్వామి చేతుల మీదుగా శంకుస్థాపన జరుగుతుంది. కాపవరం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలోని అగ్నిమాపక కేంద్రం ప్రారంభోత్సవం చేస్తారు.
- 25న కాపవరం–ముగ్గళ్ల వయా మునగాల రోడ్డు, కలవచర్లలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ పార్కులకు శంకుస్థాపన జరుగుతుంది.
- నియోజకవర్గంలోని 14 డివిజన్లలో 3 నుంచి 5 వేల మందితో బహిరంగ సభలు జరుగుతాయి. వైఎస్సార్ సీపీ యువజన విభాగం కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ ఆధ్వర్యంలో రోజూ సమావేశాలు, సభలు నిర్వహిస్తారు.

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, కోకన్వీనర్ గణేశుల పోసయ్య, రాజానగరం కన్వీనర్ దూలం పెద్ద, పార్టీ నాయకులు మందారపు వీర్రాజు, అడబాల చినబాబు, గంధం నారాయణ, కడియాల పాపారావు, కొల్లం రాజా రమాదేవి, కొండపల్లి దుర్గారావు పాల్గొన్నారు.

ఆదర్శ జీవితానికి రామాయణం నిదర్శనం

డాక్టర్ బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి



ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తున్న సంతోష్‌కుమార్ శాస్త్రి

అనపర్తి: ఆదర్శవంతమైన జీవితానికి రామాయణం నిదర్శనంగా నిలుస్తుందని హైదరాబాదుకు చెందిన శృంగేరి శారదాపీఠ ఆస్థాన పౌరాణికులు డాక్టర్ బాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రి అన్నారు. స్థానిక శారదా సంగీత కళా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో రెండో రోజు బుధవారం ఘనంగా జరిగాయి. స్థానిక టీటీడీ కల్యాణ మంటపంలో నిర్వహిస్తున్న ఆరాధనోత్సవాల్లో భాగంగా బుధవారం బాచంపల్లి సంతోష్‌కుమార్‌శాస్త్రి రామాయణ వైభవంపై ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానాటికి కనుమరుగవుతున్న భారతీయ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మానవ జీవితంలో ఎదురయ్యే ఒడిదొడుకులను అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో కొంత సమయాన్ని ఆధ్యాత్మికతకు కేటాయించాలన్నారు. రామాయణం ఆదర్శ గ్రంథమని, మానవాళి పరిపూర్ణ వ్యక్తులుగా తీర్చిదిద్దేందుకు దిక్సూచి ఉంటుందన్నారు. అనంతరం సంతోష్‌కుమార్ శాస్త్రిని శారద సంగీత కళాసమితి ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నేత్రవైద్యులు తేతలి సత్యనారాయణరెడ్డి, వ్యాపారవేత్త సత్తి జనార్ధన్‌రెడ్డి, తమలంపూడి చిన ఆదిరెడ్డి, నల్లమిల్లి వెంకట మునీశ్వరరెడ్డి, నల్లమిల్లి మురళీమోహనబాలకృష్ణారెడ్డి, కొవ్వూరి రఘునాథరెడ్డి, కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, మారెళ్ల గంగరాజు శర్మ, రెడ్డి సతీష్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాలకు సిద్ధంగా ఉన్న వాహనాలు

బిక్కవోలు: తూర్పు తిరుమలేశునిగా పేరు గావించిన బలభద్రపురం గ్రామంలోని కొలువైన ఉన్న శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు పూర్తయ్యాయని ఆలయం వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం 6.58 గంటలకు బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలు ఈ నెల 13వ తేదీ వరకూ జరగనున్నాయి. తిరుమలలో జరిగే మాదిరిగా బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు స్వామివారి వాహన సేవకుల 8 వాహనాలు సిద్ధం చేశారు. 5న శేషవాహనం, 6న గరుఢ వాహనం, 7న హనుమ, 8న అశ్వ వాహనం, 9న కల్పవృక్ష వాహనం, 10న హంసవాహనం, 11న గజవాహనం, 12న సింహవాహనంపై ఊరేగిస్తారు. 13న రథోత్సవం నిర్వహిస్తారు. పలువురు దాతలు ముందుకు వచ్చి ఆయా వాహనాలను ఆలయానికి అందజేశారు. విష్వక్సేనుడి విగ్రహాన్ని కూడా దాతలు అందజేశారు. వీటి విలువ దాదాపు రూ.20లక్షల ఉంటాయన్నారు. భక్తులు మరో రూ.25లక్షలతో స్వామి వారికి రథం తయారు చేయిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం నుంచి ప్రత్యేక పూజాలు, అభిషేకాలు, సుప్రభాత సేవ, తోమాల సేవ తదితరు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలోని భక్తులు పాల్గొని స్వామి సేవలు తరలించాలని ఆయన కోరారు.

పన్నులు నూరుశాతం వసూలు చేయాలి

సీతానగరం: మండల గ్రామ పంచాయతీలలో నూరుశాతం పన్నులు వసూలు చేయాలని డీజీపీవో జె.సత్యనారాయణ అన్నారు. మండలంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నగదు రహిత లావాదేవీలు జరపాలన్నారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రతిపాదించిన శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా గ్రామాలను శుభ్రంగా ఉంచాలన్నారు. సమిత్వ కార్యక్రమాన్ని అన్ని గ్రామ పంచాయతీలలో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. 15వ ఆర్థి సంఘం నిధులను పీఎఫ్ఎంఎస్ ద్వారా పూర్తిస్థాయిలో ఖర్చు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కేవీఎస్ఎస్ మూర్తి, పంచాయతీ కార్యదర్శులు సుజాత, ఎస్‌వీవీ సత్యనారాయణ మూర్తి, రజాక్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చిట్టిబాబు

సీతానగరం: ప్రథమ మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీ బాయి పూలే జయంతిని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు మాట్లాడుతూ నాటి సమాజంలోని కట్టుబాట్లతో బయటకు రాలేని పరిస్థితిలో ఉన్న స్త్రీలను ఇంటింటికి తిరిగి బడికి తీసుకువచ్చి సావిత్రీబాయి చదువు చెప్పారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ కె.హరేరామకృష్ణ, ఉమెన్ ఎంపవర్‌మెంట్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.సుధామయి మాట్లాడుతూ అనేక రంగాల్లో రాణిస్తున్న నేటి అత్యున్నత మహిళామణుల విజయం సావిత్రీబాయి సహనం, సాహస భావాల ఫలితమన్నారు.

ఘనంగా శారదా మాత జయంతి



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న స్వామీజీ

ప్రకాశం నగర్: స్థానిక రామకృష్ణ మఠంలో బుధవారం శారదా మాత 171వ జయంత్యుత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వేద విద్యానందజీ, స్వామి పరిజ్ఞేయానందజీ మాట్లాడుత శారదా మాత జీవితంపై సందేశం ఇచ్చారు. సుమారు 550 మంది భక్తులకు ప్రసాద వితరణ చేశారు. 171 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్వామి రఘు వీరానందజీ, స్వామీ సేవ్యానందజీ, స్వామీ ప్రజ్ఞానాధానందజీ పాల్గొన్నారు.

5న నూతన పింఛన్ల పంపిణీ

రాజానగరం: నియోజకవర్గంలోని సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాలలో కొత్తగా మంజూరైన సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు ఈనెల 6న పంపిణీ చేస్తారని ఎంపీడీఓ ఇన్‌చార్జి ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలోని తోకాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆ రోజు ఉదయం 9 గంటలకు స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అలాగే రూ.2750 నుంచి రూ.మూడు వేలకు పెరిగిన పింఛన్లను కూడా అందజేస్తారన్నారు.

చిన్నారి మహేష్ వైద్య చికిత్సకు చర్యలు



మహేష్ కాలుని పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ: చిన్నారి కొల్నాటి మహేష్ వైద్య చికిత్సకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ మాధవీలత అన్నారు. మహేష్ తల్లి దివ్యశాంతి, బంధువు వై.రామ్ కుమార్ బుధవారం కలెక్టరేట్‌లో మాధవీలతను కలిసి బాలుడి పరిస్థితిని వివరించారు. రెండేళ్ల క్రితం రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చొరవతో విజయవాడలో బాలుడి గ్రహణం మొర్రికి (కాలికి) శస్త్ర చికిత్స చేశారు. రెండేళ్ల తరువాత రావాలని డాక్టర్లు సూచించారు. బాలుడి తండ్రి శ్రీను కూలీ పనులు చేస్తుంటాడు. మరోసారి బాబుకు వైద్యం చేయించడానికి ఆర్థిక పరిస్థితి అనుకూలించడం లేదు. దీంతో సాయం చేయాలని కలెక్టర్‌ను అభ్యర్థించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. మహేష్ వైద్య చికిత్స కోసం చర్యలు తీసుకుంటామన్నారు.

ఉరి వేసుకుని మహిళ మృతి

పెదపూడి: భర్త వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే భ్రమలో ఉండి మానసిక స్థితి కోల్పోయిన ఒక మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై పి.శోభన్‌కుమార్ బుధవారం రాత్రి తెలిపిన వివరాల ప్రకారం... ఏపీత్రయం గ్రామానికి చెందిన జే.ఎం.రావు కుమార్తె సుకన్య(25)కు అదే గ్రామానికి చెందిన హరినాథ్‌కుమార్‌కు తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. అయితే మూడు నెలల క్రితం సుకన్యకు కలలో తన భర్తకు వేరే మహిళతో వివాహం జరిగినట్లు కల వచ్చిందంటూ ఎక్కువ ఆలోచించి మానసికస్థితితో బాధపడుతోంది. తరచూ ఎక్కువగా ఆలోచనల చేస్తుండేంది. అయితే తండ్రి ఎం.రావు సుకన్యను ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించాలని ఈనెల 2వ తేదీన గ్రామంలో తన ఇంటికి తీసుకొచ్చాడు. సాయంత్రం సమయంలో ఆస్పత్రికి వెళ్లాలని తయారవుతానని గదిలోకి వెళ్లి ఎంత సేపు అయినా రాకపోవడంతో ఆందోళన చెందిన తండ్రి తలుపులు పగలు గొట్టి చూడగా అప్పటికే సుకన్య ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతోంది. వెంటనే ఆమెను కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మృతిరాలుకి కుమార్తె, కొడుకు ఉన్నారు. ఈ మేరకు తండ్రి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.